క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు

కంచిలి: రానున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన మాత్రమే కాకుండా మరికొన్ని పార్టీలు వారితో కలిసినా వైఎస్సార్‌సీపీకి ఉన్న ప్రజాబలం చెక్కుచెదరదన్నారు. నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమమే తమ బలమన్నారు. రాష్ట్ర ప్రజలను ఏమార్చడానికి వస్తున్న వ్యక్తులను గమనించాలని సూచించారు.

పరిశుభ్రతకు సహకరించండి



చెత్త సేకరణ బుట్టలు అందజేస్తున్న నాయకులు

టెక్కలి: గ్రామాల్లో పరిశుభ్రతకు సహకరించి జగనన్న స్వచ్ఛ సంకల్పానికి అడుగులు వేయాలని బొప్పాయిపురం సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ జి.రాజేష్ కోరారు. మండలంలోని బొప్పాయిపురం గ్రామ సచివాలయం పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ బుట్టల పంపిణీ గురువారం చేపట్టారు. ఇంట్లో వ్యర్థ పదార్థాలను ఆరుబయట వేయకుండా చెత్త బుట్టల్లో వేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాట్నూరు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ముసుగు తీశారు



మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: టీడీపీతో కలిసి పోటీ చేస్తామని చెప్పడం ద్వారా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇన్నాళ్లకు తన ముసుగు తీశారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కురమాన బాలకృష్ణారావు, వైస్ ఎంపీపీ సువ్వారి వసంత్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి ఆరోపణలతో అరెస్టైన చంద్రబాబు పరామర్శకు వెళ్లిన పవన్ కల్యాణ్, ప్యాకేజీ మాట్లాడుకొని వచ్చారని ఆరోపించారు. తను పార్టీ పెట్టింది సొంతంగా నడపడానికి కాదని, ఊడిగం చేయడానికేనని దుమ్మెత్తిపోశారు.

'చంద్రబాబు జీవితం అవినీతిమయం'



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: చంద్రబాబు జీవితం మొత్తం అవినీతిమయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ సచివాలయం ఆవరణలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఇన్నాళ్లు వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ వచ్చాడని మండిపడ్డారు. ఇప్పటివరకు 26 కేసులకు స్టే తెచ్చుకోగలిగిన ఘనుడని వెల్లడించారు. ఎప్పటికైనా చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో ఆమెతో పాటు 14వ వార్డు కౌన్సిలర్ నీలాపు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి, నీలాపు ఢిల్లి తదితరులు ఉన్నారు.

పార్టీ విజయానికి పాటుపడాలి



మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: వైఎస్సార్‌సీపీ తరుపున టెక్కలిలో పోటీచేసే వ్యక్తి విజయానికి నాయకులు, కార్యకర్తలు పాటు పడాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా, పార్టీ సమాచార సేకరణపై సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఓటర్ల జాబితాను పరిశీలించి బూత్ స్థాయిలో ఓటర్లను, జాబితాలో తప్పులను గుర్తించాలని సూచించారు. గడిచిన ఎన్నికల్లో జరిగిన పొరపాట్లును వచ్చే ఎన్నికల్లో జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సువ్వారి వసంత్‌కుమార్, కురమాన బాలకృష్ణారావు, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు, సర్లాన బైరాగి, లవునిపల్లి ధనరాజ్, రేగల కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం



రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడిచిపెడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- కళింగదళ్ రిజర్వాయర్‌లో చేపల పెంపకం

మందస: రాష్ట్రంలోని మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. మండలంలోని బుడారిసింగి పంచాయతీలో ఉన్న కళింగదళ్ జలాశయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం 1,08,000 చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలోని మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మత్స్యకార సొసైటీల చెరువులు, గ్రామ పంచాయతీల్లోని చెరువుల్లో సైతం చేపల పెంపకం చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం 90 నుంచి 100 శాతం రాయితీ కల్పిస్తూ ఫింగర్లింగ్ చేప పిల్లలను అందిస్తోందన్నారు. ప్రతీ మత్స్యకారుడు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ ఏడాది నుంచి రాయితీ కల్పిస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి సదుపాయాలు, సౌకర్యాలు కల్పించలేదని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చేపల పెంపకం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వదేశీ మత్స్యకారులంతా ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. మెరైన్, ఆక్వా, స్వదేశీ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను అందిస్తోందన్నారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం జగనన్నకు సాటి మత్స్యకారునిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

బుడారిసింగి సర్పంచ్ సురేష్‌కుమార్‌పాణిగ్రాహి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, ఫిషరీస్ జేడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీటీసీ సీర లోకనాథం, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కురా గొడు, గిన్ని తిరుపతిరెడ్డి, శానాపతి కిషోర్‌కుమార్, సిందిరి జగన్, సార దూర్వాసులు, సవర బాలకృష్ణ, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి

- దువ్వాడ వాణి
- పలు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

నందిగాం: వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని కాపుతెంబూరు, అట్టిగాం, చిన్నలవునిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలాకి మోహనరావు, దువ్వాడ హైందవి, యర్ర చక్రవర్తి, జేసీఎస్ ఇన్‌చార్జి జడ్యాడ జయరాం, కణితి నారాయణమూర్తి, తమిరె పాల్గుణరావు, అట్టాడ శ్రీనివాసరావు, మడపాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ అపూర్వ విజయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న సాయిరాజ్

కవిటి: నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన మేలును తెలియజేయడానికి నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అపూర్వ విజయం సాధించిందని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని పాతకొజ్జిరియాలో 250వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం విజయోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్, యూత్ కన్వీనర్ అశోక్, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాబూరావు, వైస్ చైర్మన్ నీలయ్య పాల్గొన్నారు.

పింఛన్ల పండగ..!




వజ్రపుకొత్తూరు: పెద్ద మురహరిపురంలో సీఎం జగన్, మంత్రి సీదిరి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఇటీవల కొత్తగా మంజూరైన వివిధ రకాల పింఛన్లతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. పంచాయతీల పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయా లబ్ధిదారులకు నాయకులు, అధికారులు అందజేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కవిటి: లండారపుట్టుగలో...



టెక్కలి: లింగాలవలసలో....



ఇచ్ఛాపురం: బెల్లుపడలో...



నందిగాంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామంలో...



వజ్రపుకొత్తూరు రూరల్: గరుడభద్ర గ్రామంలో...



సోంపేట: పాత్రకొండలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు



కాశీబుగ్గ: కొత్త ఫించన్ అందిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మందస: మూలిపాడు గ్రామంలో...



కోటబొమ్మాళి: ప్రకాష్‌నగర్‌లో....

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎంపీపీ దాస్

సోంపేట: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అర్హులందరికీ 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు అందజేయడం జరుగుతోందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని ఇస్కలపాలేం పంచాయతీలో ఇటీవల మంజూరైన జగనన్న ఇంటి స్థలాల లబ్ధిదారులకు పట్టాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని తెలియజేశారు. సుపరిపాలన అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైపల్లి కామమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి బైపల్లి రామారావు, కామయ్య, చంద్రయ్య, బాలయ్య, కేశవరావు, పంచాయతీ కార్యదర్శి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేమంత్రిని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్

- పలు సమస్యలపై వినతిపత్రం



రైల్వేమంత్రి అశ్వని వైష్ణవ్‌కు సమస్యలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: దేశ రాజధాని న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్, అధికార ప్రతినిధి, ఇండియన్ రైల్వేస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వికాస్ కుమార్ జైన్‌లను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సమస్యలను ప్రస్తావించి, వాటిని పరిష్కరించాల్సిందిగా వినతిపత్రం అందజేశారు.

ప్రస్తావించిన సమస్యలు

- ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలు, పలాస నియోజకవర్గంలోని మందస మండలంలో నివసిస్తున్న ప్రజలు, విద్యార్థులు, వర్తకులు, రోగులు నిత్యం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం వెళ్తుంటారన్నారు. వీరి ప్రయాణ సౌకర్యార్థం ప్రస్తుతం పలాస-విశాఖ-పలాస మధ్య నడుస్తున్న ట్రైన్ నంబర్ 08531, 08532 ను ఇచ్ఛాపురం, బరంపురం వరకు పొడిగించాలని కోరారు.
- ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ ద్వారా శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, నౌపడ, పలాస రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయుటకు నిధులు విడుదల చేశాయన్నారు. అదే తరహాలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సోంపేట రైల్వేస్టేషన్‌ను కూడా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో చేర్చి అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- అదేవిధంగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పూరి-అహ్మదాబాద్ (ట్రైన్ నంబర్ 12843, 12844), పూరి-యశ్వంత్‌పూర్ వీక్లీ గరిబ్‌రథ్ (ట్రైన్ నంబర్ 22883, 22884), గాంధిగాం-పూరీ వీక్లీ సూపర్ ఫాస్ట్ (ట్రైన్ నంబర్ 22973, 22974), పూరీ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ (ట్రైన్ నంబర్ 22859, 22860)కు హాల్టు కల్పించాల కోరారు.
- అలాగే సోంపేట రైల్వేస్టేషన్‌లో హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నంబర్ 12703, 12704), జునగర్ రోడ్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 20837, 20838)లకు హాల్టు కల్పించాలని, జాడుపూడి, బారువ స్టేషన్లలో బరంపురం-విశాఖపట్నం(ట్రైన్ నంబర్ 18525, 18526)కు స్టాపేజీ కల్పించాలని విన్నవించారు.
- ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి సుర్లా రోడ్ ఎల్‌సీ గేట్ నంబర్ 329, లొకేషన్ 626(14) వద్ద ట్రాఫిక్ సమస్య వలన ప్రజలు, రోగులు రైల్వేగేటు ఎక్కువ సమయం పడిపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇచ్ఛాపురం-కొలిగాం ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.
- జాడుపూడి రైల్వేస్టేషన్ పశ్చిమ భాగంలో రైల్వే లైన్‌ను దాటడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.
- ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ ఉత్తర భాగంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ కాలనీ వద్ద ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ ఉత్తరాన బాహుదా నదికి దగ్గరలో ఉన్న అండర్ పాసేజ్ బ్రిడ్జి విస్తరణ పనులు చేపట్టడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు.
- సికింద్రాబాద్-విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య వందే భారత్ రైలును నడపాలని కోరారు. ఆ ట్రైన్‌కు ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో హాల్టు కల్పించాల్సిందిగా విన్నవించారు.
- న్యూఢిల్లీ-విశాఖపట్నం వరకు నడుస్తున్న కిసాన్ గూడ్స్ ట్రైన్‌ను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్నటువంటి 31 వార్డుల్లో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలతో తాగునీరు అందిస్తామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం సాయంత్రం 15వ వార్డులో వార్డు కౌన్సిలర్ బళ్ల రేవతి అధ్యక్షతన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వంద కోట్లతో అతి పెద్ద ప్రాజెక్టుకు శంకుస్థాపన సైతం చేశామని, జంట పట్టణాలకు మరో యాభై ఏళ్ల వరకు తాగునీటి కోసం ఎటువంటి ఆటంకం లేకుండా ఉంటుందన్నారు. అనంతరం స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, వాణిజ్య విభాగ అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ కొత పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు కోర్టు వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు నేతృత్వంలో అసంఘటిత రంగ కార్మికులకు ఉపయోగకరమైన వివిధ రకాల సంక్షేమ పథకాలు, న్యాయ సహాయంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు సదస్సు ఉంటుందని వెల్లడించారు.

విద్యార్థులకు శిక్షణా తరగతులు

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ రెండో ఏడాది ఈసీఈ విభాగానికి చెందిన 210 మంది విద్యార్థులకు 'పీసీబీ-డిజైన్'పై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. లైవ్ వైర్ సాఫ్ట్‌వేర్, డిజైన్ ఆఫ్ వేరియస్ సర్క్యూట్స్ ఇన్ లైవ్ వైర్ సాఫ్ట్‌వేర్, పీసీబీ విజర్డ్ సాఫ్ట్‌వేర్, పీసీబీ లేఔట్స్ డిజైనింగ్, ఈజీ ఈడీఏ సాఫ్ట్‌వేర్, డబుల్ లేయర్డ్ డిజైన్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

సమగ్ర భూసర్వేతో మేలు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేతో యజమానులకు మేలు జరుగుతుందని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మండలంలోని ముచ్చింద్ర పంచాయతీలో భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, ఉప తహసీల్దార్ బి.శ్రీహరి, సీఎస్‌డీటీ కె.సంతోష్, రీసర్వే డీటీ శ్రవణ్‌కుమార్, సర్పంచ్ సాడి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పనితీరు పరిశీలన

కంచిలి: మండలంలోని మకరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పనితీరును డిప్యూటీ ఈవో పగడాలమ్మ గురువారం పరిశీలించారు. అనంతరం పెద్దశ్రీరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

'మలేరియా నివారణ చర్యలు చేపట్టాలి'

టెక్కలి: పట్టణ, గ్రామాల్లో మలేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ ఆర్.మల్లేశ్వరరావు ఉన్నారు.

ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఇచ్ఛాపురం రూరల్: ఎస్సీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. మండలంలోని ముచ్చింద్ర గ్రామంలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో ఎస్సీ సామాజిక భవనం పనులకు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ సాడి గురుమూర్తి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని అన్ని పాఠశాలల్లో హిందీ దివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నిత్య జీవితంలో హిందీ భాష ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులు హిందీ అక్షరాల రూపంలో కూర్చొని ఆకట్టుకున్నారు. అలాగే హిందీ ఉపాధ్యాయులను సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: బిర్లంగి తోటూరు పాఠశాలలో హిందీ అక్షరాల రూపంలో కూర్చున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: చిత్రమాలికను ప్రదర్శిస్తున్న బూర్జపాడు విద్యార్థులు